క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేబీలేఅవుట్, పాత ప్రసూతి ఆస్పత్రి, అనంతవీధి, చెన్నారెడ్డి కాలనీ, సింగాలగుంట, అంబేడ్కర్‌కాలనీ, గాలివీధి, టీ.నగర్, ఎన్జీవోస్ కాలనీ, ఖాదీ కాలనీ, రామచంద్రనగర్, శాంతినగర్, వరదరాజనగర్, యశోదానగర్, సిరిపురంకాలనీ, కేటీ రోడ్డు, సప్తగిరినగర్, సుందరయ్యనగర్, రైల్వేకాలనీ, భవానీ నగర్, మాస్కురోడ్డు, మధురానగర్, వీవీమహల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రమాదేవి మృతికి ఎమ్మెల్యే నివాళి



రమాదేవి భౌతికదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : సీనియర్ జర్నలిస్ట్, టీటీడీ ఓఎస్డీ ఎస్.నాగేశ్వరరావు(నగేష్) తల్లి ఎస్.రమాదేవి (73) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వరదరాజనగర్‌లోని నగేష్ ఇంటి వద్దకు చేరుకుని రమాదేవి భౌతిక దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రమాదేవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీటీడీ పీఆర్వో తాళ్ల రవి, తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జోగిరెడ్డి భాస్కర్ రెడ్డి, కార్యదర్శి పున్నాగు బాలచంద్ర, కోశాధికారి పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

పాకాల : మండలంలోని కె.వడ్డేపల్లికి చెందిన రైతులకు శుక్రవారం వ్యవసాయ పరికరాలను హార్టికల్చర్ జేడీ సతీష్ పంపిణీ చేశారు. 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు డ్రిప్ పరికరాలకు 90 శాతం, స్ప్రింకర్లకు 55 శాతం, 5 ఎకరాలు పైబడిన రైతులకు డ్రిప్ పరికరాలకు 70 శాతం, స్ప్రింకర్లలకు 45 శాతం సబ్సిడీ ఇస్తున్నట్టు తెలిపారు. ఉద్యానశాఖ అధికారి శైలజ, వెంకటేష్, సూక్ష్మ సేద్య ఇంజినీర్ తులసిమణి, సుధాకర్ పాల్గొన్నారు.

తిరుపతి కమిషనర్‌గా హరికృష్ణకు అదనపు బాధ్యతలు



కమిషనర్‌గా బాధ్యతలు చేపడుతున్న హరికృష్ణ

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో తుడా వీసీ హరికృష్ణకు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఫిబ్రవరి 4 వరకు కమిషనర్‌గా వ్యవహరిస్తారు.

ముగిసిన ఆగమ సదస్సు

తిరుపతి అలిపిరి: ఆగమాలలో బాలాలయ ప్రక్రియ అనే అంశంపై శ్రీవెంకటేశ్వర వేద వర్సిటీలో నిర్వహించిన జాతీయ ఆగమ సదస్సు శుక్రవారం ముగిసింది. దీనికి టీటీడీ వైఖానస ఆగమ సలహాదారులు వేదాంతం గోపాలకృష్ణమాచార్యులు అధ్యక్షత వహించారు. ముగ్గురు పత్ర సమర్పణ చేశారు. బాలాలయే ఉత్సవ విచారః అనే అంశానికి రాష్ట్ర ఆగమ సలహా మండలి చైర్మన్ వేదాంతం సత్య శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అనంతరం ఆగమ సదనంలో ఏర్పాటుచేసిన ఆచార్య అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల స్మారక గ్రంథాలయాన్ని వీసీ రాణీ సదాశివమూర్తి, శ్రీవారి ఆలయ ప్రధానార్చలు వేణుగోపాల దీక్షితులు ప్రారంభించారు. ఈయన మాట్లాడుతూ ఆగమశాస్త్ర విరుద్ధం కాని దేశాచార, శిష్టాచార మిళితమైన బాలాలయ ప్రక్రియ జరపాలన్నారు. తమిళనాడుకు చెందిన వైఖానస ఆగమ పండితులు పి.వరదన్, చెన్నైకి చెందిన పాంచరాత్రాగమపండితులు శ్రీనివాసన్, హైదరాబాద్‌కు చెందిన శైవాగమ పండితులు గణపతి శర్మకు ఆగమ కల్పద్రుమ అవార్డులు ఇచ్చారు. సంచాలకులు శ్రీరామకృష్ణ, రాజేష్ కుమార్, నీలకంఠం, భరత్ శేఖరాచార్యులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి రిమాండ్

తిరుపతి లీగల్ : మహిళను కిడ్నాప్ చేసి లైంగిక దాడి చేసిన కేసులో చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం బాలాజీపల్లి దళితవాడకు చెందిన కావలి నాగరాజుకు ఫిబ్రవరి 2వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ గురువారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. నిందితుడు నాగరాజు గత ఏడాది నవంబర్ 17న తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఒక విద్యా సంస్థలో స్వీపర్‌గా పనిచేస్తున్న తన గ్రామానికి చెందిన మహిళను బైక్‌లో ఎక్కించుకుని తీసుకెళ్లాడు. ఒక గదిలో నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాకాల మండలం దామలచెరువు తీసుకెళ్లి అక్కడా దాడి చేశాడు. బాధిత మహిళ దిశా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు నాగరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

కరోనా కుదిపేసినా సంక్షేమం ఆగలేదు

- టీడీపీ వారూ జగనన్న పథకాలను స్వాగతిస్తున్నారు
- పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- ఎన్నడూ లేనంతగా తిరుపతి అభివృద్ధి
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష



తిరుపతి 37వ డివిజన్‌లో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: కరోనా మహమ్మారి రాష్ట్రాన్ని కుదిపేసినా, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పేదలకు సంక్షేమ పథకాలను కొనసాగించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మేయర్ శిరీష, కార్పొరేటర్ మునిరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు మురళితో కలిసి తిరుపతి 8వ డివిజన్‌లోని సంజయ్‌గాంధీకాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనకు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఎలాంటి సిఫార్సు లేకుండానే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించి తమ జీవితాల్లో వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేశారు. తాము ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడ్డారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. జగనన్నలాంటి నాయకుడు మరో 30 ఏళ్లు అధికారంలో ఉంటే పేదల జీవితాల్లో కష్టమనేది ఉండదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా జగనన్న సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులే కనిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశ రాజకీయాలకే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు.

తిరుపతిలో అభివృద్ధి పరుగులు

తిరుపతిలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పరుగులు తీస్తోందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన కార్పొరేటర్ బసవ గీత, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కట్టా గోపీయాదవ్‌తో కలిసి 37వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగర అభివృద్ధిలో భాగంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. తద్వారా తిరుపతిలో ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, వరికుంట్ల నారాయణ, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు వేమూరి జ్యోతి ప్రకాష్, కాసీమ్(చోటాబాయ్), రవిచంద్ర, గఫూర్, ఇమ్రాన్, బాలాజి, శివ, బాలసుబ్రమణ్యం, తలారి రాజేంద్ర, కంకనాల రమేష్, శ్యామల, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.12 లక్షల విరాళం





టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి చెక్కు ఇస్తున్న రాఘవేంద్ర, ఈఓ ధర్మారెడ్డికి చెక్కు అందజేస్తున్న వసంత కవిత

తిరుపతి అలిపిరి: శ్రీవేంకటేశ్వర భక్తి చానల్ ట్రస్టుకు శుక్రవారం రూ.12 లక్షలు విరాళంగా అందింది. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి దాతలు విరాళం కు్క అందజేశారు. హైదరాబాదుకు చెందిన ఈవీఎస్ఆర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరపున వారి ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర రూ.10,00,116 విరాళం అందించారు. అదేవిధంగా బెంగళూరుకు చెందిన కేసీ రెడ్డి, సరోజమ్మ వెల్ఫేర్ ఫౌండేషన్ తరపున ఎస్వీబీసీ బోర్డు సభ్యురాలు వసంత కవిత రూ.2 లక్షలను విరాళాన్ని ఈఓ ధర్మారెడ్డికి అందజేశారు.

నేడు పురంధరదాసు ఆరాధనోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీవెంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల, నాదస్వరం పాఠశాలలో శనివారం శ్రీపురంధరదాసు ఆరాధనోత్సవం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ తెలిపారు. ఇందులో భాగంగా పురంధరదాసుకు పూజలు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు సంయుక్తంగా ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దాస సంకీర్తనలను ఆలపిస్తారని తెలిపారు.

పవర్‌లూమ్స్ కార్మికులను ఆదుకోవాలి

తిరుపతి రూరల్: నాలుగో కేటగిరిలో ఉన్న పవర్‌లూమ్స్ సెక్టార్‌ను మూడో కేటగిరిలో మార్చడం వల్ల చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కందారపు మురళి తెలిపారు. ఏపీఈఆర్సీ శుక్రవారం వైజాగ్ నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహించిన బహిరంగ విచారణలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదలు, కార్మికులను విద్యుత్ చార్జీల భారం నుంచి విముక్తి కలిగించాలని ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.89 కోట్ల మంది వినియోగదారులకు ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలన్న ఆలోచన విరమించుకోవాలన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 13 మంది ఈ విచారణలో పాల్గొని తమ అభిప్రాయాలను వివరించారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 15 మందికి రూ.3 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు ఉద్యోగి మునిబాబు తెలిపారు. తిరుమల ఒన్‌టౌన్ పరిధిలో పది మంది, టూటౌన్ పరిధిలో ఐదుగురిపై పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. అదేవిధంగా తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 60 మందికి రూ.46,200 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి శుక్రవారం తీర్పు చెప్పారు. నిందితులను తిరుపతి ట్రాఫిక్, ఎస్వీయూ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

చంద్రగిరి: గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి దాతలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అనంతగుర్రప్పగారిపల్లికి చెందిన వీరపల్లి హేమాంబరధరరావు కుటుంబ సభ్యులతో కలిసి రూ.2 లక్షలు, శ్రీనివాసమంగాపురానికి చెందిన జెడ్పీ రిటైర్డ్ సీఈఓ దుర్గాప్రసాద్ రూ.50 వేలను ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డికి అందజేశారు. దాతలకు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎట్టకేలకు గిరిజనులకు శ్మశానవాటిక మంజూరు



తహసీల్దార్ శిరీష, దేవారెడ్డిని సత్కరిస్తున్న ఆముదాల కోన గిరిజనులు

చంద్రగిరి: మండలంలోని ఆముదాలకోన ఎస్టీ కాలనీకి ఎట్టకేలకు శ్మశానం మంజూరైంది. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆముదాలకోన ఎస్టీకాలనీకి శ్మశానం లేకపోవడంతో మృతులకు కొండల్లో, గుట్టల్లో అంతిమ సంస్కారాలు చేసుకుంటున్నారు. ఇటీవల అటవీ ప్రాంతంలో దహనక్రియలు చేయరాదని అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి ఎమ్మెల్యే చెవిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో తహసీల్దార్ శిరీష వారికి శ్మశానానికి స్థలం కేటాయించి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు శుక్రవారం రిటైర్డ్ ఆర్డీఓ సరస్వతమ్మతో కలిసి తహసీల్దార్ శిరీష, అగరాల దేవారెడ్డిని ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ తరతరాలుగా తమ పూర్వీకుల నుంచి గ్రామంలో ఎవరైనా మృతి చెందితే కొండల్లో, గుట్టల్లో దహనక్రియలు చేసుకునేవారమని తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సులోచన, వీఆర్వో వెంకన్న నాయుడు పాల్గొన్నారు.

భాష్యం విద్యార్థికి కాంస్య పతకం



అక్షయరమణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయి ఆర్చరీ (విలువిద్య) పోటీల్లో తిరుపతి ఎమ్మార్‌పల్లిలోని భాష్యం పాఠశాల 3వ తరగతి విద్యార్థి బి.అక్షయరమణ కాంస్య పతకం సాధించాడు. విజయవాడలో ఈ నెల 14వ తేదీన జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఇందులో అక్షయ రమణ అండర్-9 విభాగంలో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించాడు. అతన్ని విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ నారాయణస్వామి తదితరులు అభినందించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం సంఘం ఆఫీస్ బ్యారర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 23, 24 తేదీల్లో తిరుపతి జిల్లాలో ఆర్డీవో కార్యాలయాల ఎదుట దీక్షలు చేపట్టాలని, 25న కలెక్టరేట్ వద్ద నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ మాట్లాడుతూ చట్టాల మార్పుతో కార్మికులను దగా చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి, నేతలు రామచంద్రయ్య, ఎన్‌డీ.రవి, చంద్రశేఖర్‌రెడ్డి, శివ, వైఎస్.మణి, నాగరాణి, చంద్రయ్య, సుబ్రమణ్యం, మహేంద్ర పాల్గొన్నారు.

ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నా

జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. వారు శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం వచ్చినందుకు పేదలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.1.8 లక్షలు ఏమాత్రం సరిపోవడం లేదని, రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఇందుకోసం సీపీఐ పోరుబాట చేపడుతోందని తెలిపారు. ఫిబ్రవరి 22న విజయవాడలో మహాధర్నా చేపడతామని వెల్లడించారు.

రథసప్తమి నిర్వహణపై కమిటీ సమావేశం



నగరి: పట్టణంలో టీటీడీ ఆధీనంలో ఉన్న భూనీళ సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో 28న రథసప్తమిని ఘనంగా నిర్వహించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. వారు శుక్రవా రం ఆలయ అధికారి వెంకటరమణతో సమావేశమయ్యారు. ఆలయ అధికారి మాట్లాడుతూ ప్రత్యేక ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొనే వారు రూ.500 చెల్లించాలన్నారు. రథసప్తమి రోజున ఉదయం 9 గంటలకు కరియమాణిక్య స్వామికి తిరుమంజనం నిర్వహిస్తామని, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు భూనీళ సమేత కరియమాణిక్యస్వామికి కల్యాణోత్సవం చేస్తామన్నారు. దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలన్నారు. ప్రధానార్చకులు ధన్వంతరి ఆచార్యులు, మారుతీ ప్రసాద్ ఆచార్యులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

తిరుపతి అర్బన్: సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం ఉద్ధృతం చేస్తామని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ కన్వీనర్ పి.విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి జే.ధన్వంత్‌కుమార్ తెలిపారు. వారు శుక్రవారం ఉద్యోగులతో కలిసి భోజన విరామ సమయంలో తిరుపతిలోని తీర్థకట్ట వీధిలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గతేడాది నవంబర్‌లో ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించడం దారుణమన్నారు. ఈ క్రమంలో ఈ నెల 30, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. వారానికి 5 రోజుల పనిదినాలు కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. 12వ ద్వైపాక్షిక ఒప్పందంపై చర్చలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరసింహులు, జనార్దన్, భాస్కర్, మహేష్, పవన్, నందగోపాల్, లక్ష్మీపతి, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుపతిలోని గోవిందరాజులస్వామి ఆలయం సమీపంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. టి.బాబు, కృష్ణమోహన్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆగమోక్తంగా దుర్గా, లక్ష్మీ, సరస్వతి హోమం



దుర్గా, లక్ష్మీ, సరస్వతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దుర్గా, లక్ష్మీ, సరస్వతీ అమ్మవార్ల హోమం ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాల మండపంలో దుర్గా, లక్ష్మీ, సరస్వతీ అమ్మవార్లను కొలువుతీర్చారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం దుర్గా, లక్ష్మీ, సరస్వతీ అమ్మవార్ల హోమం పూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. చివరి రోజైన శనివారం రుద్ర, మృత్యుంజయ హోమం చేపట్టనున్నారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యా బోధనే లక్ష్యం



మాట్లాడుతున్న విద్యా భారతి దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: దేశభక్తితో పాటు విలువలతో కూడిన విద్యా బోధనే లక్ష్యంగా సరస్వతీ శిశుమందారాలు పనిచేస్తున్నాయని విద్యా భారతి దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జాతీయ విద్యను వికసింపజేసే లక్ష్యంతో 1973లో శ్రీ సరస్వతీ విద్యాపీఠం స్వచ్ఛంద సేవా సంస్థ సరస్వతీ శిశుమందిరాలను ప్రారంభించినట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా 26 వేల పాఠశాలలు ఉన్నాయని, ఇందులో 36 లక్షల మంది బాలబాలికలు చదువుతున్నారని పేర్కొన్నారు.

ఏపీలో 120కి పైగా పాఠశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరస్వతీ శిశుమందిరాల్లో పాఠ్య బోధనతో పాటు విద్యార్థి సమ గ్ర వికాసం, యోగా, సంస్కృతం, సంగీతం, నైతిక ఆధ్యాత్మిక విద్యా విషయాల్లో ప్రత్యేక సిలబస్ రూ పొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. తద్వా రా విద్యార్థులలో దేశభక్తి, దైవభక్తిని పెంపొందిస్తున్నా మని వివరించారు. సమావేశంలో తిరుపతి సర స్వతీ శిశుమందిర్ అధ్యక్షుడు హేమంత్‌కుమార్, సోమదత్త, ప్రధానోపాధ్యాయురాలు సుధామయి, సభ్యుడు రవిశంకర్, నాగరాజరాయల్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

చంద్రగిరి: ప్రతి ఉద్యోగీ అంకితభావంతో విధులు నిర్వహించాలని తహసీల్దార్ శిరీష తెలిపారు. ఆమె శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయం నుంచి చేసుకున్న దరఖాస్తుల పరిశీలనలో ఆలస్యం అవుతున్నట్టు గుర్తించామన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు ఈకేవైసీపై అవగాహన కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ప్రతి దుకాణం నుంచి ఎన్ని రేషన్ కార్డులకు సరుకులు ఇస్తున్నారు? ఇంకా ఎంతమందికి ఇవ్వాలి అన్న సమాచారాన్ని తనకు పంపాలని ఆదేశించారు. జగన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులను ప్రతిరోజూ పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీలు యుగంధర్, అమృత, ఆర్ఐ సులోచన ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటు నివారణపై అవగాహన



గుండెపోటు నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

చంద్రగిరి: మండలంలోని నరసింగాపురంలో శుక్రవారం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల, సామాజిక వైద్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గుండెపోటు నివారణపై అవగాహన కల్పించారు. డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి లక్ష మందిలో 235 మంది గుండెపోటుతో మృతిచెందుతున్నారని తెలిపారు. మనదేశంలో ఆ సంఖ్య 272 ఉందన్నారు. ఇందుకు పొగతాగడం, అధిక రక్తపోటు, షుగర్, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువు, ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి తదితర కారణాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ రాముడు మాట్లాడుతూ హృద్రోగులకు తిరుపతి రుయాలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకిత్, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కృషి



శ్మశానవాటికను పరిశీలిస్తున్న డీపీవో రాజశేఖర్‌రెడ్డి

తిరుచానూరు: తిరుచానూరు పంచాయతీలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం శ్మశానవాటికను సందర్శించారు. చెత్తాచెదారాన్ని తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్తను ఇక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నీలకంఠేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.